సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 24 । మార్చి । 2023



అవగాహనతోనే టీబీకి చెక్

జిల్లాలో 15 వేల మంది టీబీ బాధితులున్నారు. వారికి ప్రభుత్వం ఉచితంగా మందులిస్తోంది. శుక్రవారం ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,040
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,452
3 శాతం జీఎస్టీతో	రూ.5,616
నవర (8 గ్రా)	రూ.44,928

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.5 /26.5

గురువారం గాలిలో 73 శాతం తేమ ఉంది. శుక్రవారం జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది.



న్యూస్‌రీల్

విధుల్లోకి కొత్త డాక్టర్లు



జాయినింగ్ ఆర్డర్ అందుకుంటున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. జిల్లాకు ఎనిమిది మంది మెడికల్ ఆఫీసర్లను కేటాయించింది. వారిలో నలుగురు డాక్టర్లు గురువారం నెల్లూరులోని జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి విచ్చేసి డీఎంహెచ్‌ఓ పెంచలయ్య చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ వైద్యరంగానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తోందన్నారు. సిబ్బందిని నియమిస్తున్నట్లు చెప్పారు.

5,875 పొగాకు బేళ్ల విక్రయం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రానికి గురువారం 563 బేళ్లు రాగా వాటిలో 533 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మిగిలిన బేళ్లలో 5 నోసేల్, 1 నోబిడ్, 24 సీఆర్‌గా గుర్తించారు. మొత్తం 71,911 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.1,42,90,785ల వ్యాపారం జరిగింది. ఒక కిలోకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.185, సగటున రూ.198.73 ధర లభించింది. 8 కంపెనీలు పాల్గొన్నాయి.

- కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి గురువారం జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 5,726 బేళ్లు తీసుకురాగా 5,342 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. 384 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.174, సగటున రూ.197.54 ధర లభించింది. వేలంలో 7 కంపెనీలు పాల్గొన్నాయి.


ఇంటర్ పరీక్షలకు 719 మంది గైర్హాజరు



ఆత్మకూరులో పరీక్షలు రాసి వెళ్తున్న విద్యార్థులు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీయట్ ప్రథమ సంవత్సర పరీక్షల్లో గురువారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 719 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి 24,675 మందికి గానూ 24,198 మంది హాజరయ్యారు. 477 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,861 మందికి గానూ 1,619 మంది హాజరయ్యారు. 242 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

సోమశిలలో 55.524 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 55.524 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 2,00 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.298 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 320 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

ఉదయగిరి.. వనమూలికల సిరి

ఉదయగిరి కొండలు అమూల్యమైన వనమూలికల సిరులకు నిలయంగా ఉన్నాయి. నల్లమల, వెలిగొండ, శ్రీశైలం అడవుల్లో కూడా లభించని అరుదైన ఔషధ మొక్కలు ఇక్కడ దొరుకుతాయి. 938 మీటర్ల ఎత్తైన ఈ కొండను 'సంజీవని కొండ'గా చెప్పొచ్చు.



ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతం

కొండపై అరుదైన ఔషధ మొక్కలు

- 162 రకాల ఆయుర్వేద మూలికలు లభ్యం
- బ్రిటీష్ కాలంలోనే ఈ సంపదపై దృష్టి
- కరోనా సమయంలో ఆయుర్వేదానికి డిమాండ్
- వైద్యశాల ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి



షర్బత్ తయారు చేసే సుగంధం వేర్లగడ్డలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పురాతన వైద్య చికిత్స పద్ధతిగా ఆయుర్వేదానికి ఎంతో గుర్తింపు ఉంది. ఎన్నో రోగాలను దీర్ఘకాల వైద్యంతో సంపూర్ణంగా నియంత్రించవచ్చు. అయితే మన పరిసరాల్లోనే అమూల్యమైన ఔషధగుణాల మొక్కలున్నా ఒకప్పుడు పెద్దగా పట్టించుకోలేదు. కరోనా మహమ్మారి సమయంలో ఆయుర్వేద వైద్యానికి డిమాండ్ బాగా పెరిగింది. ఇంతకాలం నిర్లక్ష్యం చేసిన వారు సైతం ఇప్పుడు వాటిని వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం దీనికి ప్రాధాన్యమిస్తూ అత్యంత విలువైన మందులను తయారు చేసి ఆస్పత్రులకు సరఫరా చేస్తోంది. ఆయుర్వేద వైద్యశాలల్లో ప్రత్యేకించి బెడ్లు ఏర్పాటు చేసి పసరు, తైలాలతో ప్రాచీన వైద్య సేవలందిస్తోంది. దీంతో ఈ వైద్యానికి పూర్వ వైభవం లభిస్తోంది.

అపారంగా..

ఆయుర్వేద వైద్యానికి ఉపయోగించే వనమూలికలు ఉదయగిరి అడవులు, కొండల్లో అపారంగా లభిస్తున్నాయి. వైఎస్సార్, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సరిహద్దుల్లోని ఉదయగిరి, సిద్దేశ్వరం, భైరవకోన అడవులు, కొండలు, కోనల్లో 162 రకాలకు పైగానే అరుదైన వనమూలికలున్నాయి. గుండె జబ్బు, పక్షవాతం, కామెర్లు, పైత్యం, పోలియో తదితర జబ్బులను నయం చేసే ఔషధ మొక్కలను గుర్తించారు. దీర్ఘకాలిక క్యాన్సర్ వ్యాధిని నివారించే మూలికలు, జబ్బులకు ఉపయోగపడే మొక్కలు ఉదయగిరి కొండల్లో లభించాయని ప్రభుత్వ ఆయుర్వేద సలహాదారు శ్రీబాలాజీ మహర్షి గతంలో ప్రకటించారు.

శాస్త్రవేత్తల పరిశోధన

మూడు దశాబ్దాల క్రితం మహర్షి మహేష్‌యోగి ఆయుర్వేద సంస్థల ప్రతినిధులు ఉదయగిరి దుర్గాన్ని సందర్శించి అనేక ఔషధ మొక్కలను సేకరించారు. గిరిదుర్గం, పరిసర అడవుల్లో పెరిగే మొక్కలపై పరిశోధనలు చేశారు. ఆయుర్వేద వైద్యం సురక్షితమైందని ప్రకటించారు. కర్ణాటకకు చెందిన ఆయుర్వేద డాక్టర్ శ్రీఅయ్యంగార్, నెల్లూరుకు చెందిన ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ పి.చెంచలరావు పంతులు ఇక్కడి అడవుల్లో మొక్కలు, మూలికలు, భూగర్భ గడ్డలను సేకరించి నెల్లూరులోని తమ ఆయుర్వేద చికిత్సాలయంలో వినియోగించారు.

అప్పట్లోనే..

బ్రిటీష్ హయాంలోనే ఇక్కడి వృక్ష సంపదపై దృష్టి సారించారు. అనేక పరిశోధనలు జరిపారు. ఉదయగిరిలో ఒక వైద్యశాలను నెలకొల్పి ఆయుర్వేద చికిత్స అందించారు. మాదాల జానకిరాం మంత్రిగా ఉన్న కాలంలో ఉదయగిరి దుర్గంపై ఆయుర్వేద ఫార్మసీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. రెండు దశాబ్దాల క్రితం అటవీశాఖ దుర్గంపల్లి ఎగువన కొండవాలులో కొంతమేర చుట్టూ కంచె వేసి ఇక్కడి ఆయుర్వేద మొక్కలను పశువుల బారి నుంచి సంరక్షించారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసి సంరక్షకులను సైతం నియమించారు. కొన్నేళ్లకే ఈ పథకం మూలబడింది. ఇక్కడ ఆస్పత్రి నెలకొల్పి ఆయుర్వేద వైద్యానికి మరింత ఊపిరి పోయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏం లభ్యమవుతాయంటే..

మొగసిరిగడ్డ, భూచక్రగడ్డ, తిప్పతీగ, సర్పగంధి, మేకమడుసు గడ్డ, నెలలాటగడ్డ, కన్నేమల గడ్డ, కోడి అరకాళ్లు, హనుమంత జారకళ్లు, సన్నజెర్రితుకళ్లు వంటి అనేక రకాల ఔషధ మూలికలు ఇక్కడ విస్తారంగా లభిస్తాయి. పిల్లడుగు, నెమలి అడుగు, సహదేవ ఆకు, పిట్టడుగు, పోగేటి ఆకు, జెర్రిపోతు ఆకు, దీప్తలరి, ఏడద్దల చెక్క, నల్లఉప్పి వంటి అరుదుగా కనిపించే మొక్కలను ఉదయగిరి పరిసర అడవుల్లో ఆయుర్వేద శాస్త్రవేత్తలు గుర్తించారు. పూజా మందిరంలో ఉంచదగిన రామబాణం ఆకులు, రక్తపోటు నియంత్రణ, మహిళలకు గర్భ సంబంధిత వ్యాధులకు, పురుషుల వీర్య వృద్ధికి పనికొచ్చే వెలుతురు చెట్లు ఇక్కడ ఉన్నాయి. చిన్నపిల్లల వాక్ శుద్ధి కోసం ఉపయోగించే సరస్వతి ఆకు ఇక్కడి కొండ పాదల్లో నిరంతరం తడిగా ఉండే చోట లభిస్తోంది. వేసవిలో తయారు చేసే షర్బత్ శీతల పానీయంలో ఉపయోగించే సుంగధ తీగ వేర్లు లభిస్తాయి. కొండల్లో లభించే తేనె స్థానికులకు ఆదాయవనరుగా ఉపయోగపడుతోంది.



తిప్పతీగ

ఎంతో ఉపయోగం



ఉదయగిరి దుర్గంపై విలువైన ఔషధ మొక్కలున్నాయి. ఈ ప్రాంతంలో ఆయుర్వేద ఫార్మసీ ఏర్పాటుచేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎంతోమందికి ఉపాధి కూడా దొరుకుతుంది. ఆయుర్వేద వైద్యశాల ఏర్పాటుచేసి ఈ వైద్యాన్ని అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

– సీహెచ్‌వీఎస్ రామారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, గండిపాళెం

వైద్యశాల ఏర్పాటు చేయాలి



తిరుపతిలో ఆయుర్వేద వైద్యశాల ఉంది. నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాలకు చెందిన వారు ఆయుర్వేద వైద్యం కోసం అక్కడికి వెళ్లాలంటే కష్టం. స్థానికంగా వైద్యశాల ఏర్పాటు చేస్తే బాగుంటుంది. మాదాల జానకిరాం మంత్రిగా ఉన్న సమయంలో ఆయుర్వేద నిపుణులను తీసుకొచ్చి పరిశోధనలు జరిపించారు.

– షేక్ దస్తగిరి అహ్మద్, జేవీవీ నాయకుడు, ఉదయగిరి

సంరక్షణ చర్యలు చేపట్టాం



ఉదయగిరి దుర్గంతోపాటు, రేంజ్ పరిధిలోని అడవుల్లో ఉన్న ఆయుర్వేద మొక్కలు, వన మూలికల సంరక్షణకు చర్యలు చేపట్టాం. దుర్గంపై ఎంతో విలువైన ఆయుర్వేద వృక్ష సంపద ఉంది. సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటున్నందున అడవులకు నిప్పు పెట్టరాదని ప్రచార బోర్డులు ఏర్పాటుచేసి అవగాహన కల్పించి చైతన్యపరుస్తున్నాం. ఆయుర్వేద మొక్కలు, వన మూలికలను కాపాడుతున్నాం.

– తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, రేంజ్ అధికారి, ఉదయగిరి

ధాన్యపు రాశి.. రోడ్డుపై పరచి..





జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు పలుచోట్ల ధాన్యం తడిసింది. దీంతో కొందరు రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కావలి వద్ద సర్వీస్ రోడ్డుపై మహిళా కూలీలు ధాన్యం ఆరబెడుతుండగా గురువారం తీసిన చిత్రాలివి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

గాలివాన బీభత్సం



గుడ్లూరులోని శివాలయం ప్రాంతంలో నేలకొరిన విద్యుత్ స్తంభం

- కందుకూరులో పిడుగులతో కూడిన అకాలవర్షం
- నేలకొరిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- జలదంకిలో పిడుగుపాటుకు బాలుడి మృతి

కందుకూరు: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం అకాలవర్షం ముంచెత్తింది. దీనికితోడు బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు తోడై రెండుగంటలపాటు అల్లకల్లోల వాతావరణం ప్రజలను భయపెట్టింది. ప్రధానంగా కందుకూరు పట్టణంతోపాటు, పరిసర గ్రామాలు, మండల కేంద్రమైన గుడ్లూరు, గ్రామాల్లో వర్షాలు కురిశాయి. బలమైన గాలుల వల్ల పార్కురోడ్డు, పలు ప్రాంతాల్లో చెట్లు, గుడ్లూరు మండలంలో కొన్నిచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుడ్లూరు, కొత్తపేట, బసిరెడ్డిపాళెం తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలాయి. అదే సందర్భంలో పట్టణంలో రెండుచోట్ల పిడుగులు పడ్డాయి. పోతురాజుమిట్ట ప్రాంతంలో ఓ ఇంటిపై పిడుగు పడి గోడ స్వల్పంగా దెబ్బతింది. అలాగే అదే ప్రాంతంలో ఇంటిపై ఉన్న వాటర్‌ట్యాంక్‌పై మరో పిడుగు పడింది. కూలిన చెట్లను తొలగించేందుకు అటు మున్సిపల్ అధికారులు, ఇటు పంచాయతీ అధికారులు శ్రమించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

రెండు గేదెల మృతి

మండలంలోని కొండికందుకూరులో పిడుగు పడి కృష్ణవేణి అనే మహిళకు చెందిన రెండు పాడిగేదెలు మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ.1.80 లక్షలు. కుటుంబ పోషణగా ఉన్న రెండు గేదెలు మృతిచెందడంతో ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

బాతులు మేపుతుండగా..



నాని మృతదేహం

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగుపడి ఆవుల నాని (11) అనే బాలుడు మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన ఆవుల శ్రీనివాసులు – అల్లూరమ్మ దంపతులు పోలేరమ్మ గుడి సమీపంలో టెంట్ వేసుకుని జీవిస్తున్నారు. వారు బాతులు మేపుతుంటారు. వారి కుమారుడైన నాని బ్రాహ్మణక్రాక ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం నాని తన తాతతో కలిసి బాతులు మేపుతున్నాడు. ఒక్కసారిగా పొలంలో పిడుగు పడడంతో నాని కింద పడిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు అతడిని స్థానిక వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.



గుడ్లూరు-కందుకూరు ప్రధాన రహదారిపై కూలిన తాటిచెట్టు



ఈదురుగాలులతో దెబ్బతిన్న ఇల్లు

రంజాన్ నెల ఆరంభం

నెల్లూరు(బృందావనం): వినీలాకాశంలో గురువారం నెలవంక కనిపించడంతో పవిత్ర రంజాన్ మాసం ఆరంభమైంది. కఠోరమైన ఉపవాస దీక్షలకు ముస్లింలు శ్రీకారం చుట్టారు. నెలవంకను వీక్షించిన అనంతరం తరావీ నమాజు ప్రారంభించి తదుపరి ప్రత్యేక 'దువా' (ప్రార్థన) చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. జెండావీధిలో జిల్లా ముస్లింయూత్ సేవా సమితి అధ్యక్షుడు ఖాలిద్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచారు.



పొదలకూరురోడ్డులో ప్రార్థన చేస్తున్న మతపెద్దలు



విద్యుద్దీపాలంకరణలో జెండావీధి యూసుఫియా మసీదు

90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు

- కలెక్టర్ చక్రధర్‌బాబు

బుచ్చిరెడ్డిపాళెం: ఏపీఎంఐపీ ద్వారా 90 శాతం రాయితీపై రైతులకు డ్రిప్ పరికరాలు అందజేస్తున్నామని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. మండలంలోని పెనుబల్లి పంచాయతీ సాల్మన్‌పురంలో పత్తి పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రిప్ పరికరాల ద్వారా కేవలం ఆరుతడి పంటలకు సూక్ష్మబిందు రూపంలో నీటిని అందించడమే కాకుండా ఫర్టిలైజర్స్‌ను కూడా స్ప్రే చేసుకునే బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్నారు. సూక్ష్మబిందు సేద్యం వల్ల తక్కువ నీటితో పంటలను సాగు చేసి మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏపీఎంఐపీ ద్వారా సుమారు 3 వేల హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేస్తున్నట్లు చెప్పారు. సూక్ష్మ బిందు సేద్యం వల్ల పంటలోని ప్రతి మొక్కకు సమానంగా నీరు అందుతుందన్నారు. అనంతరం మండలంలోని మునులపూడి గ్రామంలో నూతనంగా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.15 లక్షలతో నిర్మించిన గిడ్డంగిని కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏపీ మైక్రో ఇరిగేషన్ పీడీ శ్రీనివాసులు, ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ నరసింహారావు, ఏఓ సురేంద్రరెడ్డి, సర్పంచ్ వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

'ఆరోగ్యమిత్ర' మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ఖాళీగా ఉన్న 15 ఆరోగ్యమిత్ర పోస్టుల భర్తీకి సంబంధించి ఫైనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించామని, జాబితాను spsrnellore.ap.gov.in/notice/recruitment అనే వెబ్‌సైట్‌లో ఉంచామని తెలియజేశారు.

చిరుధాన్యాల ఆవశ్యకతపై ప్రదర్శన

నెల్లూరు(వేదాయపాళెం): చిరుధాన్యాల ఆవశ్యకతను వివరిస్తూ గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో నెల్లూరులోని గాంధీనగర్‌లో ఉన్న మహిళా ప్రాంగణం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ సౌజన్య మాట్లాడుతూ పోషణ్ పక్వాడా కార్యక్రమాల్లో భాగంగా ర్యాలీ చేశామన్నారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచివన్నారు. రక్తహీనతను నివారించడంలో ఉపయోగపడతాయన్నారు. మెప్మా పీడీ రవీంద్ర మాట్లాడుతూ చిరుధాన్యాల గురించి పొదుపు మహిళల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హారిక, డీఆర్‌డీఏ ఏపీఎం సుబ్బరాజు, బాలకృష్ణ, అనురాధా, అర్బన్ సీడీపీఓ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు, మహిళలు

క్లుప్తంగా

కోర్టు ఉత్తర్వులతో విధుల్లోకి హెచ్ఈ

నెల్లూరు (అర్బన్) : వైద్యశాఖలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తూ సస్పెండ్‌కు గురైన సునీతను కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా వైద్యశాఖాధికారులు గురువారం తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. వైద్యశాఖలో డిప్యూటీ డెమో అధికారిగా ఉద్యోగోన్నతి జాబితాలో హెచ్ఈలు సునీత, కనకరత్నం ఉన్నారు. వీరికి పదోన్నతి వచ్చే తరుణంలో నెల్లూరులో డిప్యూటీ డెమో పోస్టు ఖాళీగా ఉంది. వీరిద్దరూ ఇక్కడే ఉండాలని ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సునీత మీద మెడికల్ డైరెక్టర్‌కు కనకరత్నం ఫిర్యాదు చేశారు. ఆమె భర్త డెత్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో అక్రమాలకు పాల్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సునీతకు మెమో ఇవ్వడం గానీ, లేదా వివరణ కోరడం గానీ జరగకుండా ఆమెను గత వారంలో సస్పెండ్ చేశారు. దీంతో ఆమె కోర్టుకు వెళ్లారు. తాను ఎక్కడా అక్రమాలకు పాల్పడలేదంటూ పేర్కొంది. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆమె ఎట్టకేలకు విధుల్లో చేరింది.

జాతీయ వర్క్‌షాప్‌లో కమిషనర్ హరిత



సమావేశంలో పాల్గొన్న అతిథులతో హరిత

నెల్లూరు సిటీ : విశాఖపట్నంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్, మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌కు నెల్లూరు నగర కమిషనర్ హరిత గురువారం హాజరయ్యారు. రాష్ట్ర పట్టణాభివృద్ధి విభాగాలు, స్థానిక సంస్థలు పాల్గొని, ప్రైవేటు ఫైనాన్సింగ్ వినియోగంపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని కార్పొరేషన్ కమిషనర్‌లు, పబ్లిక్ హెల్త్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

నగదు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్) : మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదన్న మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని ఎన్టీఆర్‌నగర్‌లో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. పి.శ్రీనివాసులు(57), సుజాత దంపతులు ఎన్టీఆర్‌నగర్‌లో ఉంటున్నారు. విద్యుత్ వైరింగ్ పనులు చేసుకుంటూ శ్రీనివాసులు జీవనం సాగిస్తున్నాడు. వారికి ఇద్దరు కుమారులు కాగా ఒకరు సూరత్‌లో, మరొకరు హైదరాబాద్‌లో ఉద్యోగరీత్యా ఉంటున్నారు. గత కొంతకాలంగా శ్రీనివాసులు ఇంటి వద్దనే ఉంటున్నాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈనెల 22వ తేదీ రాత్రి సైతం నగదు కోసం భార్యతో గొడవపడ్డాడు. కొద్దిసేపటికి గొడవ సర్దుమణగడంతో సుజాత హాల్లో పడుకోగా ఆయన బెడ్‌రూమ్‌లో నిద్రపోయాడు. ఈ క్రమంలో ఆయన ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం నిద్రలేచిన సుజాత బెడ్‌రూమ్ వద్దకు వెళ్లిచూడగా భర్త ఉరేసుకుని ఉండటంతో గుండెలవిసేలా రోదించారు. ఈ మేరకు ఆమె బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.సుమన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహనతోనే టీబీకి చెక్



దర్గామిట్టలోని టీబీ వైద్యశాలలో మైక్రో స్కోప్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



పెద్దాస్పత్రిలో పల్మనాలజి వార్డు (ఫైల్)

- జిల్లాలో 15 వేల మంది బాధితులు
- వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కృషి
- నేడు ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం

నెల్లూరు(అర్బన్) : టీబీ(క్షయ) వ్యాధి జిల్లాలో చాప కింద నీరుగా పాకుతోంది. గతంతో పోల్చుకుంటే దీని తీవ్రత తక్కువగా ఉన్నా సరైన అవగాహనతో మందులు వినియోగిస్తే వ్యాధిని త్వరగా నియంత్రించవచ్చు. టీబీపై ప్రజల్లో సరైన అవగాహన కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాది మార్చి 24వ తేదీని ప్రపంచ టీబీ నివారణ దినోత్సవంగా ప్రకటించింది. అందులో భాగంగా జిల్లాలో సైతం శుక్రవారం టీబీపై అవగాహన ర్యాలీలు జరుగబోతున్నాయి.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 52 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 16 టీబీ యూనిట్లు, 41 కళ్లె పరీక్ష కేంద్రాలున్నాయి. వీటిలో ఏడాదిలో 40,102 మందికి పరీక్షలు నిర్వహించగా 3,804 మంది కొత్త బాధితులను నిర్ధారించారు. వీరితో పాటు ముదిరిన క్షయగ్రాస్తులు మరో 370 మంది ఉన్నారు. ఇక ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో సుమారు 10,825 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. ఇలా జిల్లాలో 15 వేల మంది వరకు బాధితులున్నారు. అయితే ప్రైవేటు వైద్యశాలల్లో టీబీ నిర్ధారణ అయిన వారు ఎక్కువ మంది ప్రైవేటుగా వైద్యం తీసుకుంటూ సామాజిక కోణంలో బయటపడకుండా ఉన్నారని డాక్టర్లు పేర్కొంటున్నారు.

లక్షణాలు

రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం వస్తున్నా, బరువు తగ్గిపోయి ఛాతి నొప్పి వస్తున్నా.. కళ్లెలో రక్తపు చారలు కనపడుతున్నా పరీక్షలు చేయించుకోవాలి. టీబీ నిర్ధారణ అయితే ప్రభుత్వం ఖరీదైన మందులను ఉచితంగా ఇస్తోంది.

టీబీ నివారణకు ప్రభుత్వం కృషి

టీబీ నివారణకు ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తోంది. అందులో భాగంగా జిల్లాలోని నెల్లూరు-1, నెల్లూరు-2, ఆత్మకూరు, కోవూరు, కావలి, రాపూరు, ఉదయగిరి, బుచ్చి, వింజమూరు, ఇందుకూరుపేట, పొదలకూరు, వెంకటాచలం, కందుకూరు తదితర చోట్ల 13 టీబీ యూనిట్లు ఏర్పాటు చేసింది. 37 కళ్లె పరీక్ష కేంద్రాలను, అన్ని సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రాలు)లో ట్రూనాట్ టీబీ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యాధిని నిర్ధారిస్తున్నారు.

పౌష్టికాహారానికి నెలకు రూ.500

ప్రభుత్వం ప్రతి టీబీ బాధితుడికి పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 వంతున ఆరు నెలల పాటు వారి బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తుంది. ఇలా గత సంవత్సరం రోగులకు ప్రభుత్వం రూ 1,00,29,000లను బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అంతేకాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో టీబీని గుర్తించిన డాక్టర్లు సమాచారం ఇస్తే వారికి రెండు వాయిదాల్లో రూ.1000లను ప్రోత్సాహంగా అందిస్తారు. అలాగే టీబీ బాధితులను గుర్తించి సమాచారం అందించిన కెమిస్ట్, డ్రగ్గిస్ట్‌లకు రూ.100 చొప్పున పారితోషకం అందిస్తున్నారు. డాట్ పద్ధతిలో రోగులతో మందులు మింగిస్తున్న ఆశా కార్యకర్తలకు సాధారణ టీబీకి రూ.1000, డీఆర్ టీబీ(ముదురు టీబీ) వారికి మందులు మింగిస్తే రూ.5000 పారితోషకం కింద ఇస్తున్నారు.

ఉచితంగా వైద్యం



టీబీ నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వేలాది రూపాయల మందులను ప్రతినెలా ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ఉచితంగా అందిస్తున్నాం. ప్రైవేటు వైద్యశాలల్లో లేని టీబీ నిర్ధారణ పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయి. రోగులు వినియోగించుకోవాలి.

– డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా టీబీ నియంత్రణాధికారి, అడిషనల్ డీఎంహెచ్ఓ

మస్తాన్‌బాబుకు నివాళి



మల్లి మస్తాన్‌బాబు విగ్రహావిష్కరణ చేస్తున్న కుటుంబసభ్యులు

సంగం : ప్రముఖ పర్వతారోహకుడు దివంగత మల్లి మస్తాన్‌బాబు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు గురువారం నివాళి అర్పించారు. సంగం మండలంలోని గాంధీజనసంఘం సమీపంలో ఉన్న మల్లి మస్తాన్‌బాబు స్మృతివనంలో ఆయన విగ్రహాన్ని కుటుంబసభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మస్తాన్‌బాబు తల్లి మల్లి సుబ్బమ్మ మాట్లాడుతూ తమకు చదువు లేకపోయినా తమ బిడ్డలను ఉన్నతంగా చదివించామని, వారిలో మస్తాన్‌బాబు పర్వాతరోహణలో గిన్నిస్‌బుక్‌లో స్థానం సాధించి తమ పేరును ప్రపంచ వ్యాప్తంగా వినిపించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేత మెట్టుకూరు వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత పేరును మస్తాన్‌బాబు ప్రపంచ వ్యాప్తం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మస్తాన్‌బాబు సోదరి డాక్టర్ దొరసానమ్మ, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

25, 26న అంతర జిల్లాల షటిల్ పోటీలు

గూడూరు : పట్టణ సమీపంలోని హెచ్‌డీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో ఈనెల 25, 26వ తేదీల్లో అంతర జిల్లాల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఇండోర్ స్టేడియంలో గురువారం ఆయన మాట్లాడారు. నాన్ మెడలిస్ట్, 45 ప్లస్ రెండు విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. గెలుపొందిన జట్లకు షీల్డుతో పాటు నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.91
సన్నవి : రూ.80
పండ్లు : రూ.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	116
లేయర్ (లైవ్) :	75
బ్రాయిలర్ చికెన్ :	204
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	226
లేయర్ చికెన్ :	128

చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యం

- కలెక్టర్ చక్రధర్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్) : చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. ప్రధాన మంత్రి పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించేందుకు కలెక్టర్ తన బంగ్లాలో అధికారులతో గురువారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరేళ్లలోపు చిన్నారులకు చిరుధాన్యాలను ఇప్పటి నుంచే అలవాటు చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వినియోగిస్తే వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిరుధాన్యాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏప్రిల్ 3 వరకు నిర్వహించే పోషణ్ పక్వాడా కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, పొదుపు మహిళలను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సౌజన్య, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సుధాకర్‌రాజు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ అనూరాధ, ఎన్‌జీఓ కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్లారు.. దోచేశారు

- 11 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

నెల్లూరు(క్రైమ్) : ఇంట్లోని వారు ఊరెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లోని 11 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. రాజీవ్‌గాంధీకాలనీకి చెందిన షేక్.ఖాజాహుస్సేన్ నగరంలోని గిడ్డంగివీధిలో బంగారు ఆభరణాల తయారీ దుకాణంలో పనిచేస్తున్నారు. ఈనెల 22న సాయంత్రం ఆయన కుటుంబంతో కలిసి ఏఎస్‌పేట దర్గాకు వెళ్లారు. ఈక్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టారు. లోనికి ప్రవేశించి బీరువాను పగులగొట్టి సుమారు రూ.4 లక్షల విలువచేసే 11 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు. బాధిత కుటుంబం గురువారం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, ఎస్సై రెహమాన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించారు. బాధితుడు ఖాజా హుస్సేన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు ఐటీ శాఖలో ఉద్యోగాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ప్రతిభావంతులైన క్రీడాకారులను ఇన్‌కమ్‌టాక్స్ శాఖలో ఉద్యోగులుగా నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్నల్ సీఈఓ పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరప్రదేశ్ (వెస్ట్) ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్, ఉత్తరాఖండ్ (కాన్పూరు) ప్రాంతాలకు చెందిన ఆదాయపు పన్నుశాఖ వారు ప్రతిభావంతులైన క్రీడాకారులతో ఉద్యోగ నియామకాలను చేపడుతోందన్నారు. అర్హులైన వారు ఏప్రిల్ 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్‌టాక్స్, సెకండ్ ఫ్లోర్, ఆయకార్ భవన్, 16/69, సివిల్ లైన్స్, కాన్పూర్ - 208001 అనే అడ్రస్‌కు పోస్టు ద్వారా లేదా స్వయంగా దరఖాస్తులను అందజేయాలన్నారు. ఇతర వివరాలకు నెల్లూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఏసీ స్టేడియంలో వెంకట్రావ్ (88862 28444)ను సంప్రదించాలన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్) : అదనపు కట్నం కోసం వివాహితను, ఆమె తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి సమాచారం మేరకు.. వెంకటరెడ్డినగర్‌కు చెందిన సీతాలక్ష్మి, శివరామిరెడ్డి దంపతుల కుమార్తె అలేఖ్యకు కొత్తగూడెంకు చెందిన ప్రశాంత్‌తో 2016లో వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.10 లక్షలు, 80 సవర్ల బంగారు, 11 ఎకరాల పొలం, రెండు ప్లాట్లను కట్న కానుకుల కింద ప్రశాంత్‌కు ఇచ్చారు. వివాహానంతరం ఐదు రోజుల తర్వాత నూతన దంపతులు నెల్లూరుకు వచ్చారు. అలేఖ్య పేరు మీద ఉన్న పొలం, ప్లాట్ల ఒరిజినల్ డాక్యుమెంట్లను ఇస్తేనే కాపురానికి తీసుకెళ్తామని ప్రశాంత్, అతని తల్లిదండ్రులు ఒత్తిడి తెచ్చారు. ఇరువైపుల పెద్ద మనుషులు సర్దుబాటు చేయడంతో ఆమెను కాపురానికి తీసుకెళ్లారు. కొద్దిరోజుల తర్వాత ప్రశాంత్, అలేఖ్యలు యూఎస్ఏకు వెళ్లారు. 2017లో వారికి కుమారుడు జన్మించాడు. అయితే మరలా ప్రశాంత్, అతని తల్లిదండ్రులు అదనపుకట్నం కింద రూ.కోటి, ప్లాట్లు, పొలం ప్రశాంత్ పేరుపై రాయాలని అలేఖ్య తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చారు. కుమార్తెతో మాట్లాడనివ్వకుండా కట్టడి చేశారు. దీంతో వారు రూ.15 లక్షల నగదు, కుమార్తె పేరుపై ఉన్న పొలం, ప్లాట్ల ఒరిజినల్ డాక్యుమెంట్లను అల్లుడి తల్లిదండ్రులకు ఇచ్చారు. కాగా అలేఖ్య తల్లిదండ్రులు గతేడాది ఆగస్టులో యూఎస్ఏకు వెళ్లి కుమార్తె, మనుమడి పరిస్థితి చూసి కన్నీటి పర్యంతమయ్యారు. కాలిఫోర్నియాలోని ఫ్యామిలీ కోర్టులో కేసు పెట్టారు. గతనెలలో యూఎస్ఏ నుంచి తిరిగి వచ్చిన వారు అల్లుడి తల్లిదండ్రులను కలిసి కుమార్తె కాపురం చక్కదిద్దమని ప్రాధేయపడ్డారు. అయినా వారు అంగీకరించలేదు. దీంతో అదనపుకట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న అల్లుడు, అతని తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలని గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా మెగా యోగా



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడోత్సవాల్లో భాగంగా గురువారం మహిళలు, విద్యార్థులు మెగా యోగాలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆండాళ్ భాస్కర్ పాల్గొని మహిళలకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రవీణ లత, శ్రీనివాసులు శిక్షకులుగా వ్యవహరించారు. సెట్నల్, డీఎస్ఏ సీఈఓ పుల్లయ్య, డీఎస్ఏ చీఫ్‌కోచ్ యతిరాజ్, రామచంద్ర మిషన్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

టెన్నీకాయిట్, వాలీబాల్ పోటీలు

మెప్మా, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల మహిళలు టెన్నీకాయిట్, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. 85 పొదుపు సంఘాల మహిళలు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు హాజరు కాగా మెప్మా పీడీ రవీంద్ర పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ చక్రధర్‌బాబు పాల్గొని మహిళలతో మాట్లాడారు. సెట్నల్ సీఈఓ పుల్లయ్య, చీఫ్ కోచ్ యతిరాజ్, ఐటీ స్పెషలిస్ట్ వంకధారి అంకయ్య పాల్గొన్నారు.